# ★ జాలిగుండెల వెనుక ★

రెండు బస్సులు మారి ఆఫీసునుంచి నేనిల్లు చేరుకునేసరికి ఆరుదాటిపోతుంది అప్పటికే తను కూడా ఆఫీసునించి తిరిగి వచ్చి కాఫీతో నాకోసం ఎదురు చూస్తుంటుంది మా ఆవిడ మొదట్లో ఆమె చేతి కమ్మని కాఫీతోబాటు ఆవిడ ఏకరువు పెట్టే వాళ్ళ ఆఫీసు సంగతులు కూడా సరదాగా వింటూ వుండేవాణ్ణి కొన్నాళ్ళకి ఓపికతో వినటం సాగించాను మరికొంత కాలం తరువాత ఆ వోపిక కూడా హరించుకు పోయి విసుగుతో చెవు లప్పగించటం అలవాటు చేసుకున్నాను నా అవస్థ చూసి ఆ భగవంతుడికే జాలి కలిగిందో లేక మా ఆవిడే కరుణించిందో చెప్పలేను గాని గత పది, పదిహేను రోజుల్నించి ఆవిడ తన ఆఫీసు పురాణం నాకు వినిపించటం మానేసింది కాని ఈ పరిణామం అమాంతంగా ఆవిడకి నా మీద పుట్టుకొచ్చిన దయచేత కాదని తొందర్లోనే తేలిపోయింది ఆవిడ వుద్యోగంలో చేరిన ఈ ఆర్నెల్ల కాలంలో కనీసం రోజు కొకటి చొప్పున వాళ్ళాఫీసు జీవుల చరిత్రలన్నీ నాకు వినిపించేసింది ఇక వినిపించటానికి తన కార్యాలయంలో నరమానవుడంటూ ఆమెకి దొరికి వుండడు ఈ సంగతి వాళ్ళాఫీసులో పనిచేసే వుద్యోగుల సంఖ్యనుబట్టి తెలుసుకోగలిగాను

ఎలాగైతేనేం ఈ పది రోజులూ నా ప్రాణానికి హాయిగా వుంది టైపిస్టు రాధల్ని గురించి, గుమాస్తా గురునాథాల్ని గురించీ, సబ్ హెడ్ సంజీవరావుల్ని గురించీ విని విని తల దిమ్మెక్కి పోయి వున్న నాకు ఈ పది దినాలూ పర్వదినాలుగా కనిపిస్తున్నాయి ఆఫీసునుంచి తిరిగి రాగానే కాఫీ తాగి తీరిగ్గా పేపరు తిరగేయ గల్గుతున్నాను పార్కు కెళ్ళి పాతమిత్రు లందర్నీ మళ్ళీ కలుసుకోగలుగుతున్నాను లైబ్రరీలో కాసేపు పత్రికలు చూడగలుగుతున్నాను కాని ఈ సరదా అంతా మున్నాళ్ళ ముచ్చటే అయింది,

అప్పుడే స్నానం ముగించి పడక్కుర్చీలో వాలి పత్రిక మొదటి పేజీ తిరగేస్తున్నాను కాఫీ కప్పు నా చేతి కందిస్తూ "ఈ సంగతి విన్నారాః" అంది మా ఆవిడ

పిడుగు పడ్డట్టు అదిరిపడ్డాను ఆగిపోయిందనుకున్న ఆవిడ ఆఫీసు గొడవల వడగళ్ళ వాన మళ్ళీ మొదలౌతోందని తెలుసుకునేసరికి నాకు ఏడుపొచ్చినంత పనైంది

కాఫీ చప్పరించటం కూడా మర్చిపోయి దిగాలుపడిన మొహంతో ఆవిడకేసి చూస్తూ కూర్చున్నాను,

"ముందు కాఫీ కానివ్వండి తీరిగ్గా చెబుతాను" అంది ఆవిడ నాకు దగ్గరగా కుర్చీ లాక్కుని కూలబడుతూ

ఈ పదిరోజులుగా లేని హుషారేదో ప్రస్ఫుటంగా కనిపించింది ఆవిడ ముఖంలో

"ఏమిటి సంగతి? జులపాల హిప్పీ గాణ్ణి మీ టైపిస్టు జూలీ రెండో చెంప కూడా వాయగొట్టిందేమిటి ఈ సారి" అన్నాను లేని నవ్వుని నా ముఖాన పులుము కుని

"కాదు" అని ముద్దుగా తలూపింది ఆవిడ

"ఏం గుర్నాథం పెళ్ళాం సరాసరి సెక్షన్ లో కొచ్చేసి మొగుణ్ణి జుట్టుపట్టుకుని మరీ లాక్కెళ్ళింది ఇంటికి-అవునా?"

అదికూడా కాదనేసింది మా ఆవిడ

నూట డెభ్భైకి పైగా వున్న ఆఫీసు పక్షుల్లో ఏ పక్షిని గురించి ఇప్పుడు చెప్ప బోతుందో నేను మాత్రం ఎలా వూహించ గలను? అందుకే ఓడిపోయినట్టు ఒప్పేసు గున్నాను

"నేను చెప్పబోయేది ఓ కొత్త అమ్మాయిని గురించి" అంది ఉపోద్ఘాతం ప్రారంభించే ధోరణిలో

ఆ మాటతో నాలో కూడా కొంత కుతూహలం పెరిగింది కుర్చీలో సర్దుకుని కూర్చున్నాను

వాళ్ళాఫీసులో ఆ రోజు కుందనపు బొమ్మలాంటి ఓ అమ్మాయి కొత్తగా జాయినయింది ఆమెను మా ఆవిడ సీటుకే వేశారు లంచ్ టైమయ్యేసరికల్లా, ఏదో జన్మాంతర సంబంధం వున్నట్లు ఇద్దరూ ఆత్మీయుల్లా ఒకరితో ఒకరు కలిసిపోయారు పుత్తడి బొమ్మలాంటి ఆ అమ్మాయి జీవితం వెనుక గుండెలు పిండేసే ఓ విషాద గాథ వుండిపోయింది దేవుడు ఆమెకు తీరని ద్రోహం చేశాడు ఆ అమ్మాయికి మూడేళ్ళ కిందటే పెళ్ళ యింది భర్తకు బొంబాయిలో వున్న హెడ్డాఫీసులో మంచి ఉద్యోగం. సినిమా హీరోలా వుండేవాడు ఇద్దరూ చిలకా గోరింకల్లా వున్నారని అందరూ ముచ్చట పడ్డారు కాని వాళ్ళ దాంపత్యం మూణ్ణాళ్ళ ముచ్చటే అయ్యింది పెళ్ళయిన మూణ్ణె ల్లకే పాపం ఆమె భర్త కారేక్సిడెంటులో చనిపోయాడు అప్పుడా అమ్మాయి భర్త దగ్గర లేదు కూడాను ఏదో పల్లెటూళ్ళో వాళ్ళ బంధువుల దగ్గరుంది భర్త మృత దేహాన్ని కడసారి కళ్ళారా చూసుకునే భాగ్యం కూడా లేకపోయింది ఆ తరు వాత ఆమె కష్టాలకు అంతేలేదు నా అన్నవాళ్ళెవరూ ఆమెను చేరదీయలేదు వాళ్ళనీ వీళ్ళనీ బతిమాలుకుని, ఎలాగో ఓ అనాధాశ్రమంలో చేరి ఆగిపోయిన చదువుని పూర్తిచేసింది బొంబాయి హెడ్డాఫీసుకి అప్లైలు చేసుకోగా మేనేజి మెంటు కనికరించి మద్రాసు బ్రాంచి ఆఫీసులో వుద్యోగం ఇచ్చారు

మా ఆవిడ చెప్పడం ముగించింది. నా చేతిమీద రెండు వెచ్చని కన్నీటి బిందువులు పడేసరికి తల పైకెత్తాను ఆవిడ చెంపలమీద కన్నీటి చారికలు కని పించాయి, ఎప్పుడూ చిలిపిగా, ఇతరుల్ని గురించి వాడీలు చెప్పడమే పనిగా పెట్టు కున్న మా ఆవిడ గుండెల్లో ఎంత జాలీ, సానుభూతీ గూడుకట్టుకుని వున్నాయో నాకా క్షణాన అర్థమైంది

"పిచ్చిదానా! నువ్వెందు కేడుస్తావు? మరీ అంత సెన్సిటివ్‌గా వుండటం కూడా మంచిది కాదు ఏం చేస్తాం చెప్పు తాము చెయ్యని పాపానికి కొందరి జీవితాలు అన్యాయంగా బలై పోతూ వుంటాయి

ఆ కొత్తమ్మాయిని గురించి ఈ నాడు నీకు తెలిసింది గనుక ఇలా బాధపడి పోతున్నావు. కాని మనకు తెలియని ఎందరి జీవితాలో ఈ దేశంలో ఎన్నో రకాలుగా నలిగిపోతున్నాయి. విని వూరుకోవటం తప్ప ఎవరేం చేయగలరు చెప్పు" వూరడించే ప్రయత్నంలో అన్నాను.

పైట కొంగుతో కళ్ళు వత్తుకుంది మా ఆవిడ. ఆ కళ్ళల్లో కొంచెం కోపం తొంగి చూసింది.

"దేవుడు కరుణామయు డంటారే. ఇదేనా ఆయన నిర్వాకం! అంతగా తీసుకు పోవాలనుకుంటే కుంటివాళ్ళూ, గుడ్డి వాళ్ళూ, ఎండుటాకుల్లా పండిపోయిన వాళ్ళూ ఎంతమంది లేరీ లోకంలో. వాళ్ళందర్నీ వదలి ఆ అమ్మాయి భర్తే దొరికాడా ఆయనకి! ముద్దూ ముచ్చటా తీరకుండానే ఆ అమ్మాయి నిండు జీవితాన్ని మంట గలపటానికి ఆ దైవానికి మనసెలా వొప్పింది?"

మూణ్ణెల్లు జరిగిపోయాయి.

దేవుడు అన్యాయం చేసిన ఆ పుత్తడి బొమ్మను గురించీ, తనకు ఆమెతో ఏర్పడిన గాఢ స్నేహాన్ని గురించీ, ముచ్చటించుకున్న విషయాల్ని గురించీ, అప్పుడప్పుడూ నాతో చెపుతూనే వుంది మా ఆవిడ.

వాళ్ళిద్దరి సాన్నిహిత్యాన్ని చూసి కళ్లు కుట్టిన కొందరు ఆఫీసులో గుసగుసలాడుకునేదాకా కూడా వచ్చిందట.

"ఏమండీ! రేపు పండక్కి ఆ అమ్మాయిని మనింటికి భోజనానికి పిలిచానండీ. పాపం ఆ వర్కింగ్ విమెన్స్ హాస్టల్లో చప్పిడి మెతుకులు తిని తిని ప్రాణంవిసిగి పోయిందిట తనకి. మిమ్మల్ని పరిచయం చేసినట్టుగా కూడా వుంటుంది" అంది మా ఆవిడ నాతో ఒక రోజు.

నాకూ ఆ అమ్మాయిని చూడాలనే వుంది. "సరే" నన్నాను.

నే నూహించిన దానికంటే ఎన్నో రెట్లు అందంగా వుంది ఆ అమ్మాయి. నిజం చెప్పొద్దూ, ఆ సమయంలో మా ఆవిడ నా పక్కనే లేకుంటే ఒక్కసారి ఆ పుత్తడి బొమ్మను ఒళ్ళోకి లాక్కుని గట్టిగా ముద్దెట్టేసుకోవాలని అనిపించింది కూడాను.


రాత్రి భోజనాలైన తరువాత వరండాలో పక్కవేసింది ఆ అమ్మాయికి. గదిలో మొగుణ్ణి నేనొకణ్ణి తనకోసం వేచి వున్నాననే సంగతి కూడా గుర్తుకు రాలేదల్లే వుంది మా ఆవిడకి, అర్ధ రాత్రి దాకా స్నేహితురాల్తో కబుర్లు చెపుతూ అక్కడే పడుకుని నిద్రపోయింది. ఆ రాత్రికి మా ఆవిణ్ని నానించి దూరం చేసిన ఆ పుత్తడి బొమ్మమీద నా కేర్పడిన అసూయ అంతా ఇంతా కాదు.

వారం రోజులైంది.

ఆ సాయంత్రం మామూలుగా ఆఫీసు నుంచి ఇంటికి తిరిగి వచ్చాను. కాఫీ కప్పుని నా ముందున్న స్టూలుమీద వుంచి అలవాటుకి భిన్నంగా మౌనం పాటించి గదిలోకి వెళ్ళిపోతున్న మా ఆవిడ వంక విస్తుపోయి చూశాను. కాఫీ తాగటం ముగించి గదిలోకి నడిచాను. మంచం మీద కాళ్ళు ముడుచుకుని పడుకుని వుంది.

"ఒంట్లో బావుండలేదా?" దగ్గిరికి నడిచి నుదుటిమీద చెయివేశాను.

నా చేతిని తొలగిస్తూ "బావుండకేం.




గుండ్రాయిలా వున్నాను" అంది చిరాగ్గా

పక్కనే కూలబడి "మీ పుత్తడి బొమ్మ ఏ(వంటోం దేమిటి?" అన్నాను ఆవిడకు హుషారు తెప్పించాలనే వుద్దేశంతో

"ఛీ' దాని పేరెత్తకండి నా దగ్గర పుత్తడి బొమ్మట పుత్తడి బొమ్మ' అది కేవలం ఇత్తడి బొమ్మని ఈ రోజు తెల్సింది నాకు'" అంటూ చివాలున లేచి కూర్చుంది

ఆవిడ అంటున్న దేమిటో అర్ధం గాక దిమ్మెరపోయాను

"కాలం చెడిపోయిందండీ' మనుషులు మరీ బరి తెగించిపోయారు సంగనాచిలా ఎంత నాటక మాడింది పిచ్చిదాన్ని దాని అసలు రంగేమిటో తెలుసుకోలేక సొంత చెల్లెల్లా అభిమానించాను బాగా బుద్ధి చెప్పింది" కోపంతో మా ఆవిడ గొంతు వణుకుతోంది

"ఇంతకీ అసలేం జరిగింది? ఆ అమ్మాయిని గురించేనా నువ్వంటున్నది?" ఇంకా నమ్మ శక్యంగాక అడిగాను

"ఇంకా ఏం జరగాలి? మొగుడువచ్చి మూడేళ్ళయినా తిరక్కుండానే ఎంత పని చేసింది' హవ్వ మా సెక్షన్‌లో ఆ జుల పాల హిప్పీగాడు లేడూ' వాడితో ఎంత కాలంగా గ్రంధం నడిపిందో మరి వాణ్ణి పెళ్ళాడేసి పూలూ, బొట్టూ పెట్టుకుని తగుదునమ్మా అంటూ ముత్తయిదువులా ముస్తాబై వచ్చింది ఆఫీసుకి ఛీ' ఛీ' సిగ్గులేకపోతే సరి"

నోట మాటరాక నిశ్చేష్టుడనయ్యాను

మూణ్ణెల్ల కిందట తన స్నేహితురాలికి దేవుడు చేసిన అన్యాయాన్ని తల్చుకుని కన్నీరు కార్చిన మా ఆవిడ ముఖం ఒక్క క్షణం నా కళ్ళ ముందు కదలి చెదిరి పోయింది

('కల్కి' తమిళ మాసపత్రిక నిర్వహించిన కథానికల పోటీలో బహుమతి పొందిన కథ—జనవరి '75 ) ★